క్లుప్తంగా

పర్యావరణ పరిరక్షణకు కృషి



మొక్కలు నాటుతున్న నవనీతరావు

మల్లాపూర్: జాతీయ వనమహోత్సవం సందర్భంగా నాచారం డెక్కన్ గ్లోబల్ స్కూల్‌లో మొక్కలు నాటారు. శనివారం జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్కూల్ చైర్మన్ నవనీతరావు, మేనేజింగ్ డైరెక్టర్ నవీన్‌కుమార్ హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మొక్కలను నాటడమే కాకుండా వాటిని సంరక్షించాలని సూచించారు. అనంతరం నాచారంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపాల్ స్వర్ణ అక్కినేని, కిషోర్‌కుమార్‌రెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి జాతరకు ఎంపీకి ఆహ్వానం



మల్కాజిగిరి: 20న మల్కాజిగిరిలో జరిగే ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి జాతరకు రావాలని దేవాలయ కమిటీ సభ్యులు మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను ఆహ్వానించారు. శనివారం ఆయన ఇంటి వద్ద కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు.

అల్వాల్ ఇన్‌స్పెక్టర్‌గా ప్రశాంత్



అల్వాల్: అల్వాల్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా ప్రశాంత్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. శాంతి భద్రతల పరిరక్షణకు పూర్తిస్థాయిలో కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

దివ్యాంగ విద్యార్థులకు సేవ చేయడం అభినందనీయం

మల్లాపూర్: రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ మార్వెరిక్స్, బెటర్ హరిజాన్స్ సంయుక్తధ్వర్యంలో శనివారం సాధన మానసిక దివ్యాంగుల పాఠశాలకు 32 సీట్ల బస్సు, డిజిటల్ టీవీ, మైక్,డూప్‌స్టిక్ మెషిన్‌ను అందజేశారు. ముఖ్యఅతిథిగా రోటరీ 3150 డిస్ట్రిక్ గవర్నర్ డాక్టర్ ఎస్వీ రాంప్రసాద్ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మానసిక దివ్యాంగులకు సాధన సంస్థ చేస్తున్న సేవలను అభినందించారు. రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ మార్వెరిక్స్ అధ్యక్షులు సురేష్‌బాబు, కార్యదర్శి మాధవి, సీతాభార్గవి, సాధన సంస్థ కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, సురేఖరెడ్డి తదితరులున్నారు.

లక్ష్మీనృసింహస్వామి కల్యాణమహోత్సవం



గౌతంనగర్: డివిజన్ పరిధిలోని జయగిరి లక్ష్మీనృసింహస్వామి దేవాలయంలో శనివారం స్వాతి నక్షత్రం సందర్భంగా శ్రీలక్ష్మీనృసింహస్వామి కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. అనంతరం అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఆలయ ప్రధాన అర్చకులు రవికిరణాచార్యులు, ఆలయ కమిటీ చైర్మన్ బాలరాజుయాదవ్, కొమురయ్య, భక్తులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం


రాజేశ్వరి

మల్కాజిగిరి: మహిళ అదృశ్యమైన ఘటన మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై సునీల్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం… మల్కాజిగిరి హిల్ టాప్ కాలనీకి చెందిన పత్లావత్ శ్రీనివాస్, రాజేశ్వరి(25) భార్యాభర్తలు. గత వారం రోజులుగా భార్యాభర్తలు కుటుంబ విషయాలపై గొడవ పడుతున్నారు. ఈనెల 3న శ్రీనివాస్ కూలి పనికి వెళ్లి పని దొరకకపోవడంతో తిరిగి ఇంటికొచ్చాడు. ఆ సమయంలో భార్య ఇంటి వద్ద లేదు. దీంతో ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ రావడంతో శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యర్థాల డంపింగ్‌పై చర్యలేవి ?

రోడ్లపైనే స్వచ్ఛ ఆటోల పార్కింగ్
- తీవ్ర ఇబ్బంది పడుతున్న మల్లికార్జుననగర్ వాసులు
- దుర్వాసనతో అనారోగ్యం పాలవుతున్న ప్రజలు


గౌతంనగర్, మల్లికార్జుననగర్ ప్రధాన రహదారి పక్కన..

గౌతంనగర్: ఓ వైపు సీజనల్ వ్యాధులతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే మరోవైపు గౌతంనగర్ డివిజన్ పరిధిలోని మల్లికార్జుననగర్ కాలనీలో ఇంటి నుంచి చెత్త రిక్షాలలో సేకరించిన వ్యర్థాలను జనావాసాల్లోనే వేస్తున్నారని, ఆరోపణలు వినిపిస్తున్నాయి.

◆ మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని వివిధ కాలనీలు, ఇళ్ల నుంచి సేకరించిన వ్యర్థాలతో పాటు బీరు సీసాలు, మద్యం బాటిళ్లు, ఇతర వస్తువులను


మల్లికార్జుననగర్‌లో రోడ్డుకు ఇరువైపుల స్వచ్ఛ ఆటోల పార్కింగ్

తీసుకొచ్చి ఇళ్ల మధ్యలో ఉన్న ఖాళీ స్థలాల్లో పోసి వేరు చేస్తున్నారని కాలనీవాసులు వాపోతున్నారు.

రెండుసార్లు అగ్ని ప్రమాదాలు..

సేకరించిన వ్యర్థాలను నిల్వ ఉంచుకోవడం వల్ల గతంలో ఇక్కడ రిక్షా కార్మికులు గుడిసెలు వేసుకున్నారని, రెండుసార్లు అగ్నిప్రమాదం జరిగి భారీగా మంటలు ఎగిసిపడ్డాయని తెలిపారు. వ్యర్థాలు ఇక్కడ నిల్వ ఉంచడం వల్ల దుర్వాసనతో పాటు దోమలు, ఈగలు వృద్ధి చెంది ఇబ్బందులు కలుగుతున్నాయని చెబుతున్నారు.

అవగాహన కల్పించిన మారని తీరు..

మల్లికార్జుననగర్ గుట్ట, రోడ్ నెంబర్- 10 చెత్త రిక్షాలను సైతం రోడ్లపై పార్కింగ్ చేస్తుండటంతో రాకపోకలు సాగించాలంటే తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఇటీవల మల్కాజిగిరి ఏఎంహెచ్‌ఓ మంజుల, ట్రాఫిక్ పోలీసులకు ఫిర్యాదు చేశామని పోలీసులు వచ్చి రిక్షా కార్మికులకు అవగాహన కల్పించినప్పటికీ వారిలో ఎలాంటి మార్పు రాలేదని కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ పోలీసులు స్పందించి, డంపింగ్ వ్యర్థాలను తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం



మల్లికార్జుననగర్‌లో ఇళ్ల మధ్య స్వచ్ఛ రిక్షా కార్మికులు వ్యర్థాలు వేసి వేరు చేసుకుంటున్నారు. ఈ సమస్య దశాబ్దకాలంగా ఉంది. దీనివల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. దీనికి తోడు రోడ్డు పక్కనే స్వచ్ఛ ఆటోలను పార్క్ చేయడంతో రాకపోకలు సాగించేందుకు ఇబ్బందిగా మారింది.

– వాసు, మల్లికార్జుననగర్

అధికారులకు ఫిర్యాదు చేశాం.



గౌతంనగర్ నుంచి మల్లికార్జుననగర్‌కు వచ్చే ప్రధాన రహదారి పక్కన, మల్లికార్జుననగర్‌లోని రోడ్డు నెంబర్- 10లో చెత్త రిక్షాలు, వ్యర్థాలను వేరు చేస్తున్న విషయాన్ని మల్కాజిగిరి సర్కిల్ అధికారులు, ట్రాఫిక్ పోలీసులకు ఫిర్యాదు చేశాం. వారు కార్మికులకు తొలగించమని అవగాహన కూడా కల్పించినా పరిష్కారం సమస్య పరిష్కారం కాలేదు.

– అచ్యుతరావు, మల్లికార్జుననగర్

సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం



మల్లికార్జుననగర్‌లో ప్రతిరోజూ ఇళ్ల నుంచి సేకరించిన వ్యర్థాలను జనావాసాల మధ్య వేసి, వేరు చేసుకుంటున్న విషయం మా దృష్టికి వచ్చింది. కాలనీవాసులతో పాటు, ఇంటి యజమానులతో మాట్లాడాం. స్వచ్ఛ రిక్షా కార్మికులకు వేరే చోట స్థలాన్ని కేటాయించి తరలించేందుకు ప్రయత్నాలు చేస్తున్నాం. త్వరలో సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

– మంజుల, ఏఎంహెచ్ఓ

అదనపు రోడ్ల నిర్మాణానికి చర్యలు


వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

అల్వాల్: బొల్లారంలోని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సబ్ ఏరియా హెడ్ క్వార్టర్స్‌లో కంటోన్మెంట్ బోర్డు అధ్యక్షులు రాజీవ్, కర్నల్ వినయ్‌కుమార్, కమాండింగ్ సురేష్‌లను శనివారం మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని ఏవోసీ పరిధిలో అదనపు రోడ్ల నిర్మాణానికి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని, రైల్వే బ్రిడ్జిల నిర్మాణానికి సహకరించాలని ఆయన వారికి వినతిపత్రం అందజేశారు. రైల్వే అధికారులు సీనియర్ సెక్షన్ ఇంజినీర్ జగదీష్‌బాబు, మిలినియల్, బీఆర్ఎస్ నేతలు అరుణ్‌రావు పాల్గొన్నారు.

చెట్ల నరికివేతపై స్పందించిన అటవీశాఖ


మర్రిచెట్టు వద్ద అటవీశాఖ అధికారులు

కుషాయిగూడ: చర్లపల్లి డివిజన్, శివసాయినగర్‌లో భారీ మర్రిచెట్టు, తాడిచెట్టును నరికివేసిన ఘటనపై మేడ్చల్ జిల్లా అటవీశాఖ అధికారులు స్పందించారు. శనివారం జిల్లా అటవీశాఖ అధికారి రేణుక, డిప్యూటీ రేంజర్ ఇంద్రసేనారెడ్డిలు శివసాయినగర్‌లోని నరికివేతకు గురైన చెట్లను పరిశీలించారు. స్థానికుల నుంచి వివరాలు సేకరించిన అధికారులు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా చెట్లను నరికివేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేశారు. సీసీఎస్ అధ్యక్షుడు పద్మారెడ్డి, అశోక్, బింగి బిక్షపతి, సత్యనారాయణ, దామోదర్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, రమేష్, గోపాలకృష్ణ, గోపాల్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలి


జలమండలి అధికారులతో కార్పొరేటర్ ప్రభుదాస్

కుషాయిగూడ: డివిజన్ పరిధిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలని మీర్‌పేట్-హెచ్‌బీ కాలనీ డివిజన్ కార్పొరేటర్ ప్రభుదాస్ జలమండలి అధికారులకు సూచించారు. ఓల్డ్ మీర్‌పేట్, శాంతినగర్, అన్నపూర్ణకాలనీలో తాగునీటి సరఫరాతో ఇబ్బందులు, లో ప్రెషర్ సమ్యలను కార్పొరేటర్ దృష్టికి తీసుకురావడంతో శనివారం ఆయన జలమండలి అధికారులతో సమావేశమయ్యారు. కాలనీల్లో తాగునీటి సమస్యలను వివరించి పరిష్కరించాలని కోరారు. డివిజన్ పరిధిలో ఎలాంటి సమస్యలున్నా తక్షణమే స్పందించి మెరుగైన తాగునీటి సరఫరా జరిగేలా చూడాలన్నారు. వాటర్‌వర్క్స్ డీజీఎం సతీష్, ఏజీఎం వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

చింతల చెరువు కట్టను పరిశీలించిన హైడ్రా అధికారులు


చెరువు కట్టను పరిశీలిస్తున్న హైడ్రా అధికారులు

రామంతాపూర్: భగాయత్ సర్వే నెంబర్ 43లోని 34 గుంటల ప్రభుత్వ భూమి కబ్జాకు గురైందనే ఫిర్యాదు మేరకు శనివారం సదరు స్థలాన్ని హైడ్రా అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రామంతాపూర్ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు బండారి బిక్షపతి చేసిన ఫిర్యాదు మేరకు ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించినట్లు, తదుపరి చర్యల నిమిత్తం పూర్తిస్థాయి నివేదికను హైడ్రా కమిషనర్‌కు అందించనున్నట్లు చెప్పారు.

ప్రభుత్వ స్థలం పరిశీలన..

బోడుప్పల్: చెంగిచర్లలో కబ్జాకు గురైన చింతల చెరువు కట్టను శనివారం హైడ్రా అధికారులు పరిశీలించారు. హైడ్రా ఇన్‌స్పెక్టర్ సైదులు, హైడ్రా తహసీల్దార్, మేడిపల్లి తహసీల్దార్ హసీనా, ఇరిగేషన్ ఏఈ పరమేష్ చెరువు కట్ట ఆనుకుని ఉన్న బఫర్‌జోన్‌ను సర్వే చేశారు. పక్కనే నిర్మించిన బహుళ అంతస్తులు బఫర్ జోన్‌లోకి వస్తున్నాయని, దీనిపై పూర్తి నివేదిక తయారు చేసి హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు అందజేస్తామని వివరించారు. ప్రభాకర్‌గౌడ్, కొత్త కిశోర్‌గౌడ్, శివశంకర్, రంగ బ్రహ్మన్నగౌడ్ పాల్గొన్నారు.

అలరించిన కూచిపూడి ప్రదర్శన



ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఎస్‌కేఎస్ కళాక్షేత్రం డా. కృష్ణకుమారి శిష్య బృందంచే నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. వినాయక కౌతం, దశావతార శబ్దం, శుక్లామ్ భరధరం, పలుకే బంగారామాయేనా తదితర అంశాలను కళాకారులు ప్రదర్శించి మెప్పించారు.

త్యాగానికి ప్రతీక మొహర్రం


మొక్కులు తీర్చుకుంటున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

మల్లాపూర్: త్యాగాలకు ప్రతీక మొహర్రం అని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం నాచారంలో చాంద్‌పాషాదర్గాలో జరిగిన మొహర్రం వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొని దట్టి, పూలను అందజేశారు. మేడాల మల్లికార్జున్‌గౌడ్, ఆత్రూబాయ్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించండి


కార్పొరేటర్ రాజ్‌జితేంద్రనాథ్‌కు వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు

అల్వాల్: మచ్చబొల్లారం డివిజన్ రాయల్ ఎన్‌క్లేవ్ కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ అసోసియేషన్ సభ్యులు శనివారం కార్పొరేటర్ రాజ్‌జితేంద్రనాథ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ, సీసీరోడ్లు మంజూరు చేయాలని వారు వినతిపత్రంలో పేర్కొన్నారు. అనిల్ రెడ్డి, భాస్కర్‌రెడ్డి, అబ్దుల్, వీవీ.రెడ్డి, రంగాచారి, రాణి, శారద, కరిష్మ, రవళిక తదితరులు పాల్గొన్నారు.

కరెంట్ అఫైర్స్‌పై అవగాహన పెంచుకోవాలి

బోడుప్పల్: విద్యార్థులు చదువుతోపాటు కరెంట్ అఫైర్స్‌పై అవగాహన కలిగి ఉండాలని విద్యాజ్యోతి ఉన్నత పాఠశాల డైరెక్టర్ శ్రవణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. చెంగిచర్లలోని విద్యాజ్యోతి ఉన్నత పాఠశాలలో వివిధ కరిక్యులర్ యాక్టివిటీస్ నిర్వహించారు. శనివారం 'రెడ్ డే ఐ లవ్ మై స్కూల్' , 'ఇరాన్ ఇజ్రాయిల్ యుద్ధం' మీద క్విజ్, 'సోషల్ మీడియా దాని ప్రభావం 'పై చర్చాగోష్టి నిర్వహించారు. ప్రిన్సిపాల్ నీలిమా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మేకల చోరీ.. కేసు నమోదు

అల్వాల్: మేకల కొట్టం నుంచి అర్ధరాత్రి మేకలు చోరీ అయిన ఘటన అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మచ్చబొల్లారంలో నివసించే శ్రీకాంత్ మాంసం వ్యాపారి. కాగా తన దుకాణం పక్కనే మేకల కొట్టంలో మేకలు ఉంచాడు. శనివారం ఉదయం లేచి చూసేసరికి సుమారు 12 మేకలు కనిపించలేదు. సీసీ ఫుటేజీని పరిశీలించగా.. దుండగులు అర్ధరాత్రి బొలేరో వాహనంలో మేకలను ఎత్తుకెళ్లినట్లు గుర్తించాడు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు రక్షణ కిట్ల అందజేత

మల్లాపూర్: పారిశుద్ధ్య కార్మికులు తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి అన్నారు. శనివారం మల్లాపూర్ వార్డు కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికులకు రక్షణ సేఫ్టీ కిట్లను అందజేశారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. పారిశుద్ధ్య కార్మికులు అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ఎస్ఎఫ్ఏలు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సేవలు వెలకట్టలేనివి..

కాప్రా: పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని కాప్రా కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి అన్నారు. శనివారం కాప్రా వార్డు కార్యాలయం వద్ద సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జగన్‌తో కలిసి వారికి రక్షణ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎండ, వర్షం తేడా లేకుండా మనందరికీ సేవలందించే పారిశుద్ధ్య కార్మికులు, సిబ్బంది ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం రక్షణ కిట్లను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. శానిటరీ సూపర్‌వైజర్ సుదర్శన్, జవాన్లు, ఎస్ఎఫ్ఏలు పాల్గొన్నారు.

మల్లాపూర్: నాచారం డివిజన్‌కు చెందిన పారిశుద్ధ్య కార్మికులకు నాచారం వార్డు కార్యాలయంలో వ్యక్తిగత రక్షణ పరికరాలను కార్పొరేటర్ శాంతి అందజేశారు. ఎస్ఎఫ్ఏలు యాకస్వామి, భూలక్ష్మి, రాజేష్, బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

కుషాయిగూడ: స్వచ్ఛత కోసం కృషిచేసే పారిశుద్ధ్య కార్మికులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని కార్పొరేటర్ ప్రభుదాస్ అన్నారు. శనివారం హెచ్‌బీకాలనీ వార్డు కార్యాలయంలో సిబ్బంది వ్యక్తిగత రక్షణ పరికరాలను శానిటేషన్ సూపర్‌వైజర్ సుదర్శన్‌తో కలిసి పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం అందజేసిన రక్షణ పరికరాలను విధిగా ధరించి విధులు నిర్వహించాలని సూచించారు.


రక్షణ కిట్లను అందజేస్తున్న కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి


కాప్రా వార్డు కార్యాలయం వద్ద..

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి


కార్మిక సదస్సులో మాట్లాడుతున్న పాలడుగు భాస్కర్

మల్లాపూర్: కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు జూలై 9న జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ పిలుపునిచ్చారు. శనివారం నాచారం చౌరస్తాలో ఇండస్ట్రియల్ ఎంప్లాయిస్ యూనియన్, కార్మిక సంఘాలు ఇండస్ట్రియల్ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ ప్రధాన కార్యదర్శి గణేష్ అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాలడుగు భాస్కర్ హాజరై మాట్లాడారు. కార్మికులు శతాబ్దాలుగా సాగించిన పోరాటాల ఫలితంగా వచ్చిన 29 కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో 4 లేబర్‌కోడ్‌లు తీసుకురావడం అత్యంత ప్రమాదకరమైన చర్య అని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఎస్.రమ, ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్‌సభ్యులు శంకర్‌రావు, బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు మారయ్య, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, దస్తగిరి, మల్లారెడ్డి, శాంతం రమేష్, సూర్యం, ప్రవీణ, సతీష్, శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్: 9న నిర్వహించే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఉప్పల్ సీఐటీయూ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పారిశ్రామిక వాడలో బైక్‌ర్యాలీ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ.. నిర్వహించే ఈ సమ్మెకు కార్మికులంతా ఏకమై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

పెండింగ్ స్కాలర్‌షిప్స్ విడుదల చేయాలని ధర్నా



ఈసీఐఎల్ చౌరస్తాలో ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కుషాయిగూడ: పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శనివారం ఈసీఐఎల్ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న రూ.8వేల కోట్ల స్కాలర్‌షిప్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సకాలంలో రీయింబర్స్‌మెంట్ రాకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఒత్తిడికి గురౌతున్నారన్నారు. ప్రజాపాలన పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలన్నారు. లేదంటే రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపడతామన్నారు. అనిల్, శ్యామ్, నారాయణ, భార్గవ్, రోహిత్, తిలక్ పాల్గొన్నారు.

రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని ధర్నా..

ఉప్పల్: గత పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న రూ. 8000 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఉప్పల్‌లో నిరసన చేపట్టారు. సీఎం పదే పదే ఫీజు రీయింబర్స్‌మెంట్ త్వరలోనే విడుదల చేస్తామని ప్రకటించినా.. ఇప్పటి వరకు ఎలాంటి స్పందన లేకపోవడం శోచనీయమన్నారు. డిగ్రీ, ఇంజినీరింగ్ చదువుతున్న విద్యార్థులు ఫీజులు కట్టలేక యాజమాన్యాల ఒత్తిడి భరించలేక అనేక ఇబ్బందులు పడుతున్నారని, ఆందోళన వ్యక్తం చేశారు. సాయిచరణ్, రాకేష్, రామ్, సురేష్ పాల్గొన్నారు.

విద్యార్థులు నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి


విద్యార్థులకు బాధ్యతలు అప్పగిస్తున్న డీఐ బాలస్వామి

బోడుప్పల్: విద్యార్థులు చిన్నప్పటి నుంచే నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని మేడిపల్లి డీఐ బాలస్వామి అన్నారు. బోడుప్పల్ కిరణ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో శనివారం నిర్వహించిన 'ఇన్వెస్టర్ సెర్మనీ' కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై కౌన్సిల్‌కు ఎంపికైన విద్యార్థులకు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి.6వ తరగతి నుంచి పదోతరగతి వరకు ఉన్న విద్యార్థులు కవాతు నిర్వహించారు. పాఠశాల వ్యవస్థాపకులు రితేష్, నిర్వాహకులు రూపేష్, హెచ్ఎం. తనుశ్రీ, ఎస్సై మధు, విద్యార్థులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై సమీక్ష


సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ శ్రీవాణి

రామంతాపూర్: బోనాల పండుగ, వరుసగా వచ్చే పండుగల దృష్ట్యా రామంతాపూర్ డివిజన్ పరిధిలోని ఆలయాలు పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచాలని కార్పొరేటర్ శ్రీవాణి కోరారు. శనివారం జీహెచ్ఎంసీ ఉప్పల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో డివిజన్‌కు సంబంధించిన కొన్ని విషయాలపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో కార్పొరేటర్‌తో పాటు డిప్యూటీ కమిషనర్ ఆంజనేయులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. హార్టికల్చర్, ఎలక్ట్రికల్ విభాగాల మధ్య సమన్వయలోపం ఉన్న విషయాన్ని గుర్తించి త్వరగా ఈ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పారిశుద్ధ్య విభాగానికి చెందిన శానిటరీ జవాన్లు తమ విధులను క్రమబద్ధంగా నిర్వహించాలని, లేదంటే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. శానిటేషన్ డీఈ చందన, ఎలక్ట్రికల్ ఏఈ లావణ్య, హార్టికల్చరల్ ఏఈ శ్రీనివాస్‌చారి, హైడ్రా ఇన్‌చార్జి వీరేంద్రకుమార్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ పర్యటన


అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ శ్రవణ్

మల్కాజిగిరి: మాన్‌సూన్‌టీం అప్రమత్తంగా ఉండాలని మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ సూచించారు. శనివారం న్యూ విద్యానగర్, ఓల్డ్ నేరెడ్‌మెట్‌లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా న్యూ విద్యానగర్‌లో ఎంపీలాడ్స్ నిధులతో వేసిన నూతన బోర్‌వెల్‌ను ప్రారంభించి సీసీరోడ్డును పరిశీలించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఈ ఏడాది మాన్‌సూన్ టీమ్స్ హైడ్రా పరిధిలోకి తీసుకొచ్చారని స్థానికంగా సిబ్బంది అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. వాజ్‌పేయినగర్ వద్ద వర్షం ప్రధాన రహదారిపై వరద నీరు నిలవకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ నవీన్, వీఐ రమేష్, మాన్‌సూన్‌టీమ్ ఇన్‌చార్జి చంద్రశేఖర్, నందుయాదవ్, రాజు, మురళి, సాయి తదితరులు పాల్గొన్నారు.